క్లుప్తంగా

గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా శ్రీలక్ష్మి


న్యాయమూర్తి శ్రీలక్ష్మి

గాజువాక: గాజువాక ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా యార్లగడ్డ శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం గాజువాక అదనపు ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కమ్ సీనియర్ డివిజన్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, రాజమండ్రిలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఎ.కృష్ణ ప్రసాద్‌ను పదోన్నతిపై గాజువాక అదనపు ప్రధాన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సీనియర్ డివిజన్ జడ్జిగా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

స్టడీమెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీమెటీరియల్ అంజేస్తున్న స్థానిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదవుతున్న విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్, దేముళ్లు, రవిచంద్, నాయకులు అప్పలరాజు, మురళి, గోవింద్, తమ్మిరాజు, జి.ఎస్.మూర్తి, అప్పలరాజు, దేముడు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటక్‌లో భారీగా చేరికలు


ఇంటక్ ప్రతినిధుల సమక్షంలో చేరిన కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు బుధవారం ఐఎన్‌టీయూసీలో చేరారు.గత ఆరేళ్లుగా ఎన్నో సంక్షేమ పథకాలు కోల్పోయామని, కంపెనీ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు సీనియర్ కార్మికులు పొందిన ఏ ఒక్క వెల్ఫేర్ కూడా తమకు అందకుండా పోయిందని వాపోయారు. ఇంటక్ రథసారథి మంత్రి రాజశేఖర్ నాయకత్వంపై నమ్మకంతో ఎస్ఎంఎస్, వివిధ విభాగాల యువకార్మికులు ఇంటక్ అధ్యక్షుడు పి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో చేరారు. కార్యక్రమంలో వి.ఎస్.రాజు, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, పద్ది అప్పలరాజు, నడుపూరు వెంకన్న, కోరుబిల్లి అప్పారావు, సాయి, లోకేష్, ఆడారి జగదీష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి విరాళాలు


విరాళం అందజేస్తున్న కంబాల శంకర్, చందన దంపతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం గ్రామ దేవతలైన దుర్గాలమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల నూతన ఆలయాల నిర్మాణానికి దాతలు విరాళాలు అందించి ధాతృత్వాన్ని చాటుకుంటున్నారు. బుధవారం కంబాల శంకర్, చందన దంపతులు రూ.20 వేలు, ఇనుకోటి శరత్‌బాబు, వెంకటలక్ష్మి దంపతులు రూ.10 వేలు , నాగోలు భాస్కరరావు, మంగ దంపతులు రూ.11,116 , రజపాల రాంబాబు, వెంకటలక్ష్మి దంపతులు రూ.11,116 విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

కల్యాణ మండపం పనులు ప్రారంభించాలని ర్యాలీ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కాలం చెల్లిన కల్యాణ మండపం స్థానంలో నూతన కల్యాణ మండపం తక్షణమే నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం పలు సంఘాల నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎవరో ఒక వ్యక్తి అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో నిర్మించ తలపెట్టిన కల్యాణ మండపం పనులు ప్రారంభించక పోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో తెలుగు శక్తి అధ్యక్షుడు రామ్, పలు సంఘాల నాయకులు నావాన సింహాచలం, కాకి శ్రీదేవి, కొల్లి అప్పలరెడ్డి, కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక పక్క గంగవరం పోర్టు నుంచి.. మరో పక్క ఆటో నగర్‌లోని పరిశ్రమల నుంచి.. ఇంకో పక్క భారీ వాహనాల రాకపోకల కారణంగా ఎగసి పడుతున్న దమ్ము ధూళితో సతమతవుతున్నాం.. అది చాలదన్నట్టు తమ ప్రాణాలకు ముప్పు తెచ్చే మిక్సింగ్ యార్డు ఏర్పాటు చేశారని కండిపిల్లి వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం వెదజల్లుతున్న క్రషర్‌ను ఎత్తి వేయాలని నినదించారు. ఆవేదనతో క్రషర్‌లోకి దూసుకువచ్చారు. ధూళితో ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే క్రషర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. – పెదగంట్యాడ


నిల్వ చేసిన మెటీరియల్

కాలుష్యంపై కన్నెర్ర

- కదం తొక్కిన కండిపిల్లి వాసులు
- అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన
- క్రషర్‌ను తరలించాలని డిమాండ్
- లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక

కాలుష్యంతో సతమతమవుతున్న కండిపిల్లి వీధి వాసులు కన్నెర్ర చేశారు. కాలుష్యం బారి నుంచి విముక్తి కల్పించాలని ఆందోళన బాట పట్టారు. గ్రామానికి చెందిన నాయకుడు గొందేశి పైడిరెడ్డి (పెద్ద రెడ్డి) ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని యార్డ్ వద్ద బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరు పుట్టినప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని చెప్పారు. ఇప్పటికే పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం కారణంగా రోగాల బారిన పడుతున్నామన్నారు. ఇప్పుడు కొత్తగా ఇక్కడ యార్డ్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ యార్డ్‌లో కెమికల్స్ కలిపిన క్రషర్స్ కారణంగా దుమ్ము ధూళి ఎగసి ఇళ్లలోకి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ స్టీల్ ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేశామని.. మళ్లీ ఇక్కడ ఏపీఐఐసీకి 260 ఎకరాలు భూమిఇచ్చామన్నారు. అయితే యువతకు ఉపాధి అవకాశాలు ఉంటాయని భావించి భూములిస్తే.. ఆ పరిశ్రమల వల్ల మా ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఏకరువు పెట్టారు. ఇక్కడ ఉన్న 250 ప్లాట్లలో ఎక్కడా కూడా పరిశ్రమలు పెట్టకుండా రసాయనాలను డంపింగ్ చేసుకునేందుకు యార్డ్ మార్చారని ధ్వజమెత్తారు. యార్డ్‌లో బొగ్గు, ఐరన్ ఓర్ వంటి వాటిని డంప్ చేస్తున్నారని, గాలి వీస్తే చాలు బొగ్గు రవ్వలు, ఐరన్ ఓర్ ఎగసి పడుతున్నాయని వివరించారు. వీటి ప్రభావం ఒక్క కండిపిల్లి వీధిపైనే కాకుండా పెదగంట్యాడ మండలంలోని పెదగంట్యాడ, గొందేశి వీధి, గొడ్డువానిపాలెంపై పడుతోందన్నారు. వెంటనే ఈ యార్డ్‌ను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కలవల రమణ, దల్లి అప్పలరెడ్డి, సీహెచ్ తమ్మయ్యరెడ్డి, పురుషోత్తం, అప్పలరెడ్డి, అప్పారావు పాల్గొన్నారు.


క్రషర్ వద్ద ఆందోళన చేస్తున్న కండిపిల్లి వీధి వాసులు


క్రషర్ లోకి దూసుకు వస్తున్న స్థానికులు

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజువాక: గొంతినవానిపాలెం 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 14న మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా కణితి రోడ్, చైతన్యనగర్, శాంతినగర్, గొంతినవానిపాలెం, ప్రశాంతినగర్, మెహర్‌నగర్, గ్రంథాలయం వీధి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: మింది 33/11 కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో జీఏ కాలనీ, ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్ లోని 11 కేవీ విద్యుత్ వైర్లపై చెట్లకొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ అప్పన్నకాలనీ, గ్లోబెక్స్, కోకో కోలా ఏరియా, గిరిప్రసాద్‌కాలనీ, కాళికానగర్, ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పైపులైన్ లీకేజీకి చెక్



తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులుచేపడుతున్న దృశ్యం

కూర్మన్నపాలెం: తాగునీటి పైపులైన్ లీకులకు అధికారులు చెక్ చెప్పారు. వృథాగా పోతున్న నీటికి బ్రేక్ వేశారు. 86వ వార్డు పరిధిలోని ఫకీర్‌తక్యాలో తాగునీటి పైప్‌లైన్ లీకుల కారణంగా నీరంతా వృథాగా పోయేది. దీంతో వందలాది కుటుంబాలు తాగునీటికి కటకటలాడేవారు. ఈ నేపథ్యంలో 'పైపులైనుకు లీకులు.. తాగునీటికి ఇబ్బందులు' శీర్షికన ఈ నెల 8న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథానికి జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. పైప్‌లైన్ పనులను బుధవారం చేపట్టారు. ఎక్కడికక్కడ లీకులను అరికట్టి ప్రజలకు తాగునీటిని అందించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తీరం.. జన సంద్రం

- పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన పాతగంగవరం, అప్పికొండ తీరాలు
- ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు


పాత గంగవరం తీరంలో సముద్రస్నానాలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు పోటెత్తారు. పాతగంగ వరం తీరంలో మంగళవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు బుధవారం వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి తీరంలో కొలువైన మాధవ స్వామి, మహాలక్ష్మి దేవిని దర్శించుకున్నారు. భక్తుల కోసం తాగునీరు, ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు గరికిన అప్పలరాజు, చోడిపల్లి ముసలయ్య, పల్లేటి దేముడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.


పూజలందుకున్న మాధవ స్వామి, మహాలక్ష్మిదేవి

- 77వ వార్డు అప్పికొండ తీరానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం రాత్రి జాగారణ చేసిన భక్తులు బుధవారం ఉదయం అప్పికొండ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

స్పోర్ట్స్ కిట్స్ అందజేత


స్పోర్ట్స్ కిట్స్‌తో విద్యార్థులు

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాందీ ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. 93 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ బ్యాగులు, షూ, సాక్సులు, రెండు టీ షర్టులు, పెన్ను, పుస్తకాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాందీ ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాల యాజమాన్యకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం చిన్నారులకు వితరణ

పెదగంట్యాడ: భవిత కేంద్రంలోని చిన్నారుల బంగారు భవిష్యత్తుకు దాతలు సహకరించాలని మండల విద్యా శాఖాధికారి కె.రమణాజీ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం టీఎల్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ములగాడకు చెందిన హిమబిందు చిన్నారులకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారుల్లో ఉత్సాహం నింపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకువచ్చి భవిత కేంద్రంలోని చిన్నారుల సంక్షేమానికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, జయభారతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెంకన్నకు పల్లకీ సేవ


మాఢవీధుల్లో శ్రీ వారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి పల్లకీ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం దివ్యక్షేత్రం మాడవీధుల్లో శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశుని పల్లకి అధిష్టంపజేసి సేవా ఉత్సవాన్ని మహిళల కోలాటం నడుమ కనుల పండువగా నిర్వహించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న డిమాండ్ లెటర్ల జారీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్‌కు సంబంధించి డిమాండ్ లెటర్లు బుధవారం పెద్ద ఎత్తున జారీ అయ్యాయి. స్టీల్‌ప్లాంట్ ఎగ్జెంప్టెడ్ ట్రస్ట్ నిబంధనలు హయ్యర్ పెన్షన్‌కు అనుగుణంగా ఉన్నాయని ప్రావిడెంట్ ఫండ్ అధికారులు తెలపడంతో లెటర్ల జారీ ప్రక్రియ వేగవంతం అయింది. బుధవారం నాటికి మొత్తం 5,106 మందికి లెటర్లు జారీ అయ్యాయి. వారంలోగా మిగిలిన వారికి లెటర్లు అందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


విజయదుర్గ

ఉక్కునగరం: బంధువుల ఇంటికి వచ్చిన యువకుడు బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో స్టీల్ ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అందించిన వివరాలివి.. అనకాపల్లి జిల్లా చీడిగుమ్మళ గ్రామానికి చెందిన కోట కళ్యాణం కుమారుడు విజయదుర్గ ఆర్నెల్ల కిందట ఇంటి నుంచి వెళ్లి పోయాడు. ఈ నెల 2న స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్-6లో నివసిస్తున్న సోదరి సాగర రాజ్యలక్ష్మి ఇంటికి వచ్చాడు. ఆ రోజు దుకాణానికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవింద నామస్మరణ మార్మోగింది. మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం ఆరుగంటలకు ప్రారంభించిన గిరి ప్రదక్షిణలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చకర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా తిరువీధి


కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవంలో నిర్వాహకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డ దయాల్‌నగర్‌లో వెంకటాద్రిపై కొలువుదీరిన కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి తిరువీధి మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తిప్పల వెంకటరమణారెడ్డి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి పుష్పయాగం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అధిక ఉత్పత్తితో స్టీల్‌ప్లాంట్ పురోభివృద్ధి


విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ తదితరులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి అధిక ఉత్పత్తితోనే సాధ్యపడుతుందని స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ ఏ 2 విభాగాధిపతి బి.జయకుమార్ అన్నారు. విభాగాధిపతిగాబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు విజయ్‌కుమార్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో అంతా సమష్టిగా కృషి చేసి అధిక ఉత్పత్తి సాధించాల్సి ఉందన్నారు. ఇందుకోసం కార్మిక సంఘాలు, కార్మికులు ముందుకు సాగాలన్నారు. కార్మికుల సమస్యలపై తనకు పూర్తిగా అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్‌ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, పి.వి.రమణమూర్తి, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, దేముడు, డి.మోహన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడమ్మతల్లి పండగ


అమ్మవారికి పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి


భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న బట్టు పైడిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పిట్టవానిపాలెం, చుట్టుపక్కల గ్రామాల ఆరాధ్యదేవత పైడమ్మ తల్లి అమ్మవారి పండగను మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.అమ్మవారిని గాజువాక వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి,నాయకులు బొడ్డ గోవింద్, మహేష్, శివ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బట్టు పైడిరెడ్డి ప్రారంభించారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా వీర జగదీశ్వరి ధ్యాన సంస్మరణోత్సవం


సంస్మరణోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

పెదగంట్యాడ: భగవాన్ పత్రీజీ దివ్య ఆశీస్సులతో, పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడలోని అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో బ్రహ్మవిద్వరిష్ఠ తాడి వీర జగదీశ్వరి నాలుగో ధ్యాన సంస్మరణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గాజువాక ప్రాంతంలో ధ్యానం, శాకాహార విశిష్టత కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మీసాల శివగణేశ్వరరావు, రేవతీ దేవి, రత్నకుమారి, మోహన్, సత్యవతి, సీఆర్ రావు, వనిత, అప్పారావు, సుబ్బలక్ష్మి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.